శ్రావణి ఉపాకర్మ

శ్లో॥ వేదోదితం స్వకం కర్మ నిత్యం కుర్యాదతంద్రిత:।
తద్ధికుర్వన్ యథాశక్తి ప్రాప్నోతి పరమాంగతిమ్॥

వేదంలో ప్రతిపాదించిన విధులను మానవుడు నిత్యం ఆచరిస్తుండాలి. యథాశక్తిగా వాటిని ఆచరించడం ద్వారా తాను సంస్కారవంతుడై ఇతరులను సంస్కరింపజేసేందుకు అర్హతను పొందుతాడు. అటువంటి సంస్కారాలలో ఉపాకర్మ అతి ముఖ్యమైంది.

ఉపనయనం అయిన తరువాత ప్రతిఒక్కరు వేదాధ్యయనం ప్రారంభించాలంటే ఉపాకర్మ ఆచరించవలసి ఉంటుంది. అప్పుడుమాత్రమే వేదాన్ని అధ్యయనం చేయడానికి అర్హులు అవుతారు. ఈ ఉపాకర్మను శ్రావణ పౌర్ణిమనాడు ఆచరించాలి. శ్రావణ పౌర్ణిమకే శ్రావణి అనిపేరు. అందుకే ఉపాకర్మను శ్రావణి అనికూడా అంటారు.




ఇది ఆచార్యులు అంటే గురువులు సన్నిధానంలో జరగవలసిన విధి. తన శిష్యులనందరిని వెంటబెట్టుకొని వారందరి చేత సామూహికంగా దీనిని ఆచరింపచేస్తాడు గురువు. “వేదోనిత్యమధీయతాం” అన్నట్లుగా నిత్య అధ్యయనం చేయాల్సింది వేదం. ఆచారవంతుడై నిత్యకర్మలను ఆచరిస్తు భక్తితో గురువుగారి సాన్నిధ్యంలో ఉంటూ గురుముఖత: వేదాన్ని అధ్యయనం చేయాల్సిఉంటుంది. ఇలా ఎంతోశ్రమతో వేదాన్ని చదివేవారికి వారు సంవత్సరంపాటు చదివిన వేదం ధారణలో ఉండాలంటే ఈ ఉపాకర్మను ఆచరించాలని “పరాశరస్మృతి” చెబుతోంది. అయితే కేవలం విద్యను అభ్యసించే బ్రహ్మచారులేకాదు, గృహస్తులుకూడా దీన్ని ఆచరించాలని “ధర్మసింధు” ఆదేశం.

ఉపాకర్మ గొప్పవైదికక్రియ. ఋషిపూజా, తర్పణం, హోమం, యజ్ఞోపవీత ధారణం, బ్రహ్మయజ్ఞం మొదలైనవి ఇందులోని ప్రధాన అంశాలు. ఉపాకర్మ ఎందుకు ఆచరించాలో కొంచెం ఆలోచించి చూడవలసిన అవసరం ఉన్నది. ఇదిప్రధానంగా ప్రజ్ఞా, మేధా, ధారణ కలిగేందుకై చేసేది. ఆయావేదాలను అధ్యయనం చేసేవారు వారివారి ఋషుల అనుగ్రహాన్ని పొంది తద్వారా వారు అధ్యయనం చేసిన, చేయబోయే మంత్రాలు తేజోవంతం అయ్యేందుకు ఇది ఉపకరిస్తుంది. అలాగే వేదఋషుల అనుగ్రహమూ కలుగుతుంది. ఉపనయనమైన నూతన వటువులకు మొదటిసారివచ్చే ఉపాకర్మను ఘనంగా ఆచరిస్తారు.



ఋగ్వేదులైనవారు శ్రావణమాసంలో ఏరోజు శ్రవణానక్షత్రం ఉంటుందో ఆరోజే ఆచరించాలి. యజుర్వేదులకు పౌర్ణిమ ప్రధానం. వారు పౌర్ణిమనాడు దీన్ని ఆచరిస్తారు. సామవేదులు మాత్రం హస్తా నక్షత్రం ఉన్నరోజున ఆచరించవలసి ఉంటుంది. ఇలా ఆయవేదాలవారు వారికి నియమించిన తిథి నక్షత్రాలనుబట్టి ఉపాకర్మను ఆచరిస్తారు. ఏదైనా కారణంచేత శ్రావణమాసంలో ఉపాకర్మ ఆచరించలేనివారు ఆషాఢమాసంలోకాని, భాద్రపదంలోకాని చేయాలి.

"ఆశ్వలాయన ఆపస్తమ్బీయ ఉపాకర్మ ప్రయోగః" అనేగ్రంథంలో వివరించబడి ఉన్న ప్రకారంగా శ్రావణపౌర్ణిమనాడు ఉపాకర్మను ఆచరించేవారంతా కలిసి సామూహికంగా దగ్గరలో ఉన్న నదీతీరానికి లేదా చెరువుకివెళ్లి అక్కడి జలాలను ప్రార్థించి మంత్రపూర్వకంగా పదిరకాలైన స్నానం చేస్తారు. దేవతలు, ఋషులు నదులలో కొలువై ఉంటారు. కాబట్టి ఈసందర్భంగా నదీస్నానం సర్వదోషాలను తొలగిస్తుంది. పంచగవ్యప్రాశన చేసి శరీరంలోని దోషాలను తొలగించుకుంటారు. అక్కడే తీరంలో దర్భలపై కూర్చుని వరుసగా ప్రజాపతి, సోముడు, అగ్ని, విశ్వేదేవతలు, సాగ్ంహితీ, యాజ్ఞికి, వారుణీ, బ్రహ్మస్వయంభువు మొదలైన తొమ్మిదిమంది ఋషులను దర్భలతో తయారుచేసి భక్తితో వారిని పూజించి తర్పణాలను ఇస్తారు. అనంతరం అగ్నిని ప్రతిష్ఠించుకొని మోదుగు, రావిసమిధలతో పాటుగా ఆవునేయితో దేవతలకు,ఋషులకు ఆహుతులను సమర్పిస్తారు. యజ్ఞోపవీతానికి సంస్కారాలన్నీ చేసి దాన్నిధరిస్తారు. చివరగా యజ్ఞపురుషుని ప్రార్థించి ప్రసాదాన్ని స్వీకరిస్తారు. కొంతమంది ఈ ఉపాకర్మలో భాగంగా విరజాహోమాలని కూడా ఆచరిస్తారు. సంవత్సరం పాటు చేసిన దోషాలు తొలగేందుకు చెప్పవలసిన మంత్రాలు ఇందులో ఉంటాయి. దొంగతనం, బ్రహ్మహత్యా, గురుద్రోహం, గోహింస, సురాపానం, భ్రూణహత్యల వల్ల కలిగే దోషాలు తొలగుగాక! వాక్కుతో, మనస్సుతో, కళ్ళతో, చెవులతో, నాలుకతో, ముక్కుతో, బుద్ధితో చేసిన ఏపాపాలు ఉన్నాయో అవన్నీ మానుండి దూరమగుగాక! అంటూ మంత్రాలను పఠిస్తు హోమాన్ని నిర్వహిస్తారు.



ఉపాకర్మ సందేశం

ఉపాకర్మ సామూహికంగా ఆచరించేకర్మ. అన్నిరోజులలో ఎవరివారి కార్యక్రమాలలో హడావుడిగా ఉండేవారు ఏడాదిలో కనీసం ఒక్కసారైనా అందరూ ఒకేచోటికిచేరి సామూహికంగా పూజాదులు నిర్వహించడంవల్ల సమిష్టితత్త్వం పెరుగుతుంది. అందరూ తలా ఒకబాధ్యతతో కార్యక్రమాన్ని పూర్తిచేసుకుని ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పొందుతారు. ఇది లౌకికప్రయోజనం. నదీతీరాలలో ఆచరించే స్నానాదులవల్ల నదులను శుభ్రంగా ఉంచుకోవాలనే ఆలోచన పెంపొందుతుంది.

పరమ పవిత్రం-ఉపవీతం

మహర్షులు మనకు విధించిన పదహారు సంస్కారాలలో ఉపనయనం ఒకటి. సంస్కారాలన్నింటిలో ఇది అత్యంత ప్రాముఖ్యమైంది. ఉపనయనం ద్వారా గురువు తనశిష్యునికి ప్రతిభాపాటవాలను, జ్ఞానాన్ని ఉపదేశిస్తాడు. ఉపనయన సంస్కారాన్ని పొందినవారిని ద్విజులని అంటారు. "ద్విజము" అంటే రెండుసార్లు పుట్టింది అని అర్థం. తల్లికడుపునుండి బయటికి రావడం మొదటి పుట్టుకైతే, తల్లిదండ్రి ఉపనయనం చేసిన పిదప గురూపదేశం పొందడం రెండవజన్మ. అందుకే దీనికి అంత ప్రాముఖ్యం.

ఉపనయన సందర్భంలోనే యజ్ఞోపవీతాన్ని ధరింపచేస్తారు. యజ్ఞ+ఉపవీతం అనే రెండు పదాల కలయికే యజ్ఞోపవీతం. ఎడమభుజంపైనుండి ధరిస్తారు కాబట్టి దీనినే ఉపవీతమంటారని "అమరకోశం" చెబుతోంది. యజ్ఞోపవీతానికి బ్రహ్మసూత్రం, యజ్ఞసూత్రం అనే నామాంతరాలుకూడా ఉన్నాయి. ఇందులోని మూడుపోగులు సృష్టిస్థితిలయకారకులైన బ్రహ్మవిష్ణుమహేశ్వరులను సూచిస్తాయి. దీనిని సామాన్య భాషలో జంధ్యం అనికూడా అంటారు. మనస్సు, వాక్కు, కర్మలను అదుపులో ఉంచుకున్నదానికి సూచనగా జంధ్యం ధరిస్తారని పెద్దలు చెబుతారు.

ఆదిదేవుడు, సర్వమంగళా(పార్వతీ)పతి, సర్వమంగళ కారకుడైన శివుడుకూడా మంగళం కలిగేందుకు ఉపవీతాన్ని ధరిస్తాడని యజుర్వేదంలోని "నమోహరికేశాయోపవీతినే పుష్టానాం పతయేనమః" అనేమంత్రం మనకు చెబుతోంది.



ఉపవీత ప్రశస్తిని వర్ణిస్తు కృష్ణయజుర్వేదంలో ఒక కథ ఉంది. స్వర్గాధిపత్యాన్ని పొందాలనే కోరికతో దేవతలు, రాక్షసులు యజ్ఞాన్ని ప్రారంభించారు. ఇరువైపులవారూ గొప్పగా యజ్ఞయాగాది క్రతువులను నిర్వహించారు. అయితే రాక్షసులు బుద్ధిబలంతో కాకుండా కేవలం భుజబలాన్నే నమ్ముకుని మూర్ఖంగా యజ్ఞాన్ని ఆచరించారు. దేవతలు మాత్రం శాస్త్రీయమైన పద్ధతిలో బ్రహ్మచర్యంతో, తపోదీక్షతో ఆచరించారు. ఈ ఇరువురికి తేడా ఉపవీతమే! ఉపవీతాన్ని కలిగిన దేవతలు యజ్ఞయాగాది క్రతువుల ద్వారా స్వర్గలోకాన్ని పొందారని ఈ వృత్తాంతం తెలియజేస్తోంది. అంతేకాదు!.....శాస్త్రీయపద్ధతిలో యజ్ఞోపవీతం ధరించినవాడు ఏకొంచమైనా వేదాన్ని అభ్యసిస్తే అది యజ్ఞయాగాదిక్రతువులను ఆచరించిన ఫలితంతో సమానమని చెప్పబడింది.

ఆచారభూషణం అనేగ్రంథంలో.....

శ్లో॥ దేహో మానుష ఏవ షణ్ణవతి సంఖ్యాకైర్మితోస్వ్యఙ్గులైః।
వేదస్స్వఙ్గులిపర్వసు ద్విజవరైస్సంసూచ్య సంపద్యతే॥

శ్లో॥ తద్రూపో రవిరేష మేరు మనిశం సంఖ్యాం కరోత్యత్ర।
తత్కార్యాషణ్ణవతి స్త్రిధోర్ధ్వ వృదియం శ్రీయజ్ఞసూత్రే ద్విజైః॥

ఎవరికివారు వారిశరీరాన్ని కొలుచుకుంటే 96 అంగుళాలు ఉంటుంది. వేదస్వరూపుడైన సూర్యభగవానుడు రాత్రింబవళ్ళు మేరువుకు ప్రదక్షిణం చేస్తుంటాడు. అలా ఒకసారి ప్రదక్షిణచేసే సమయంలో నాలుగుదిక్కులకు కలిపి (4×24=96) తొంభైయారు పరిస్పందములు అవుతాయి. పైవాటికి సూచికగా యజ్ఞోపవీతం కూడా 96బెత్తాలే ఉంటుంది. ఉపవీతంలోని మూడు దారాలలో ఇరవైఏడు పోగులు ఉంటాయి. ఇవి అశ్విని మొదలైన ఇరవైఏడు నక్షత్రాలకు గుర్తు.

ఎవరికివారు వారిశరీరాన్ని కొలుచుకుంటే 96 అంగుళాలు ఉంటుంది. వేదస్వరూపుడైన సూర్యభగవానుడు రాత్రింబవళ్ళు మేరువుకు ప్రదక్షిణం చేస్తుంటాడు. అలా ఒకసారి ప్రదక్షిణచేసే సమయంలో నాలుగుదిక్కులకు కలిపి (4×24=96) తొంభైయారు పరిస్పందములు అవుతాయి. పైవాటికి సూచికగా యజ్ఞోపవీతం కూడా 96బెత్తాలే ఉంటుంది. ఉపవీతంలోని మూడు దారాలలో ఇరవైఏడు పోగులు ఉంటాయి. ఇవి అశ్విని మొదలైన ఇరవైఏడు నక్షత్రాలకు గుర్తు.

ఆదిదేవుడు, సర్వమంగళా(పార్వతీ)పతి, సర్వమంగళ కారకుడైన శివుడుకూడా మంగళం కలిగేందుకు ఉపవీతాన్ని ధరిస్తాడని యజుర్వేదంలోని "నమోహరికేశాయోపవీతినే పుష్టానాం పతయేనమ:" అనేమంత్రం మనకు చెబుతోంది..



వ్యాస రచన

అప్పాల శ్యామ్‌ప్రణీత్ శర్మ అవధాని

వేదపండితులు

అచ్చులాపూర్, మంచిర్యాల జిల్లా, తెలంగాణ

సెల్ : 9440951366

aspsharma84@gmail.com

××